# ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

**మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**

తాండూరు, డిసెంబర్ 9: ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకాన్ని ప్రారంభించారు. తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మహలక్ష్మి పథకాన్ని తాండూరు ఆర్టీసీ డిపోలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్ ప్రయాణం) పథకం, రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సహాయం రూ.10 లక్షల పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. త్వరలో మిగితా పథకాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సమత, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



# కార్యకర్తలకు అండగా ఉంటా

**మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి**

కులకచర్ల, డిసెంబర్ 9 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వం చేసుకున్న చెల్లాపూర్ గ్రామానికి చెందిన పోలేపల్లి బచ్చయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో రూ.2లక్షల బీమా మంజూరైంది. దీంతో శనివారం చెల్లాపూర్ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులకు 2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తోందని అన్నారు. కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకుంటుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు 2లక్షల బీమా చేయించడం జరిగిందని అన్నారు. పరిగి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సేరి రాంరెడ్డి, చెల్లాపూర్ సర్పంచ్ పోలేపల్లి చంద్రయ్య, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు హరికృష్ణ, దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చెల్లాపూర్‌లో బాధిత కుటుంబానికి రూ. 2లక్షల చెక్కును అందజేస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

## పథకాల అమలు బాధ్యత కాంగ్రెస్‌దే..

**ఎమ్మెల్యే సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి**

పరిగి టౌన్, డిసెంబర్ 9 : ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో శనివారం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని స్థానిక ఎమ్మెల్యే టి.రాంమోహన్ రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి పరిగి బస్టాండులో ప్రారంభించారు. మహిళలు ఉచితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించవచ్చని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ వెనుకడుగువేసే ప్రసక్తేలేదన్నారు. మిగిలిన పథకాలను సైతం అమలు చేసే బాధ్యత కాంగ్రెస్‌ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లాల్‌కృష్ణప్రసాద్, శ్రీను, ఆర్. శ్రీను, పరశురాంరెడ్డి, ఎర్రగడ్డపల్లి కృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి

## 160 ఎకరాల్లో వరిసాగుకు తైబందీ

బొంరాస్‌పేట, డిసెంబర్ 9 : మండలంలోని మెట్లకుంట ఎల్లమ్మ చెరువు కింద యాసంగిలో 160 ఎకరాలలో వరి సాగు చేయాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శనివారం సర్పంచ్ కావలి నారాయణ అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులు, గ్రామస్తులు తైబందీ కోసం సమావేశమయ్యారు. ఎల్లమ్మ చెరువు నిండినందున నీటి లభ్యత ఉందని, పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది లేనందున తూము ద్వారా నీటి విడుదలకు అనుమతించాలని రైతులు తాసిల్దార్‌ను కోరాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహులు నాయుడు, దశరథ్, రైతులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ మధుకర్

మర్పల్లి, డిసెంబర్ 9 : మండలంలోని గుర్రంగట్టు తండాకు చెందిన శంకర్ నాయక్ శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి శనివారం శంకర్ అంత్యక్రియలకు రూ.5వేలు పంపించగా, స్థానిక నాయకుడు గోవర్ధన్ మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. అలాగే జడ్పీటీసీ మధుకర్ గుర్రంగట్టు తండాలోని శంకర్ నాయక్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌస్, నాయకులు సంతోష్, మిత్ర, నవీన్ తండా వాసులు పాల్గొన్నారు.


## లాల్‌పహాడ్‌కు బస్ సర్వీసులు నడపాలి

పూడూరు, డిసెంబర్ 9 : గ్రామాల ప్రజలు, విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా పల్లె వెలుగు బస్ సర్వీసులు నడపాలని ఆయా గ్రామాల సర్పంచులు బి.జయమ్మ, మల్లిక, పెంటమ్మ, సంతోష వేర్వేరుగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వికారాబాద్ నుంచి పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి, చన్గోముల్, మేడిపల్లి కలాన్, కంకల్, నిజాంపేట మేడిపల్లి, లాల్‌పహాడ్ వరకు ఆర్టీసీ బస్ నడిపేది. దీంతో ఈ ప్రాంతాల ప్రజలు హైదరాబాద్, వికారాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉండేదని తెలిపారు. వికారాబాద్ నుంచి ఈ గ్రామాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారుగా 5 సర్వీసులు ఉండేవని చెప్పారు. ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు ఈ రూట్‌లో బస్‌నడపక పోవడంతో పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల మీదుగా బస్సులను నడిపితే ప్రభుత్వం మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్ ప్రయాణం చేసే అవకాశం ఉంటుందని పలు గ్రామాల సర్పంచులు, ప్రయాణికులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తిక మాసం

**ఆలయాల్లో పూజలు చేసిన మహిళలు**

వికారాబాద్, డిసెంబర్ 9 : వికారాబాద్ అనంతపద్మనాభస్వామి దేవాలయంలో మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కార్తిక మాసం సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. శనివారం సెలవు దినం సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో సేదతీరారు.



ఆలయ ఆవరణలో సేద తీరుతున్న భక్తులు



# మంచు దుప్పటి

**రోడ్లు, ఇండ్లపై కప్పుకొంటున్న పొగ మంచు**

వికారాబాద్/మోమిన్‌పేట, డిసెంబర్ 9 : వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉదయం మంచుదుప్పటి కమ్ముకుంటున్నది. ఉదయం 7 గంటలు అవుతున్నా మంచు వీడకపోవడంతో మంచు పూర్తిగా పేరుకుపోయింది. చలి కాలం కావడంతో ఉదయం తెల్లని మంచు కురువడంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. పొలాలు, రోడ్లు, ఇండ్లపై పొగ మంచు కప్పుకొని ఉండటంతో ప్రజలు చలికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పూడూరు, డిసెంబర్ 9 : దావత్ వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు పై ఆగిఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, మరికొందరికి గాయాలైన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గిరి తెలిపిన వివరాల ప్రకారం... పూడూరు మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన గోరెంక శివ కుమార్ (25) అదే గ్రామానికి చెందిన వారి కులస్తులది మేడికొండ గ్రామంలో శుక్రవారం రాత్రి (దావత్) విందుకు వెళ్లారు. దావత్ ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా హైదరాబాద్-బీజాపూర్ హై రోడ్డు రాకంచర్ల సమీపంలో లారీ డ్రైవర్ రోడ్డుపై నిలిపివుంచాడు. దీంతో బొలెరో వాహనంలో వస్తున్న వారు రోడ్డుపై ఉన్న లారీని ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే శివకుమార్ మృతి చెందగా మరికొందరికి గాయాలు అయ్యాయి కాగా వారిని వైద్యం కోసం దవాఖానకు పంపించినట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించి, మృతుడి తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

మహేశ్వరం, డిసెంబర్ 9: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శనివారం శివగంగ దేవాలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయంలో కొబ్బరి కాయలను కొట్టి కేసీఆర్ త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి రావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుడ్డు కృష్ణ యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ కడమోని ప్రభాకర్, మాజీ సర్పంచ్ ఆనందం, నాయకులు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, నవీన్, వీరబాబు, మహేందర్, బొట్టు శ్రీనివాస్, కృష్ణ, రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

